06ATP27_06ATP27.qxd 16-08-2024 PM 11:01 Page 1



## ఘనంగా కొల్హాపురిమహాలక్ష్మికి పూజలు

**అగళి, ఆగస్టు 16 ప్రభాతవార్త**



రత్నగిరిలో వెలిసిన కొల్హాపురి మహాలక్ష్మికి వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమకు వివిధ రకాల పూలతో, వేప ఆకులతో ముద్దబంతి పూలతో అలంకరించారు. వర మహాలక్ష్మిరోజు దేవీ పూజల్లో పాల్గొంటే దనం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం. రత్నగిరి గ్రామంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు దేవికి హారతులుపట్టి పూజలు నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళ హారతి అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అదే విధంగా అగళిలో వెలిసిన మారెమ్మ దేవతకు కూడా వర మహాలక్ష్మిపండుగను పురస్కరించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ మండలి వారు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## ఘనంగా వర మహాలక్ష్మి వేడుకలు

**అగళి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

అగళి మండలంలో వర మహాలక్ష్మి పండుగను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు వారిఇళ్లల్లోనే మహాలక్ష్మి మట్టి వవిగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించారు. మహాలక్ష్మిని వివిధ రకాల పూలతో, హారాలతో అలంకరించడంతోపాటు మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. వివిధ రకాల తినుబండారాలను చేసి మహాలక్ష్మి విగ్రహం ముందుంచి పూజలు నిర్వహించారు. వేకువ జామునుంచే వరమహాలక్ష్మి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు ఒకరింటికి మరొకరు వెళ్లి దేవి ఆశీర్వాదాలు చేసుకోవడంతోపాటు ప్రసాదాన్ని స్వీకరించారు. వర మహాలక్ష్మి పూజను భక్తి శ్రద్దలతో పూజిస్తే లక్ష్మి వారి వెంట వరిస్తుందని భక్తుల విశ్వాసం. వర మహాలక్ష్మిరోజు పూలు, పళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.



వర మహాలక్ష్మిని అలంకరించిన దృశ్యం

## గుడిబండ తహశీల్దారుగా కరుణాకర్ బాధ్యతలు

**- తహశీల్దారును సన్మానించిన తెదేపా నాయకులు**

**గుడిబండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

గుడిబండ తహశీల్దారుగా కరుణాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన జమ్మలమడుగు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్బంగా తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, డిప్యూటీ తహశీల్దారు రాంభూపాల్‌రెడ్డి, ఆర్ఐ మహమ్మద్ బిలాల్, స్వాగతం పలికి సన్మానించారు. ఈ క్రమంలో తహశీల్దారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానని మండలప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల ప్రధానకార్యదర్శి ప్రకాష్, లాయర్‌శివకుమార్, సిటీస్వామి,ఈరన్న, విఆర్ఓలు రాజు, సంధ్య తదితర తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దారును సన్మానిస్తున్న తెదేపా నాయకులు

## ఉరవకొండ ప్రాంతంలో భారీ వర్షం

**- కాస్త ఊరట లభిస్తుందంటున్న రైతులు**

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

ఉరవకొండ ప్రాంతంలో శుక్రవారం మధ్యాన్నం భారీ వర్షం కురిసింది. మధ్యాన్నం 12.30 గంటల నుండి దాదాపు 40 నిమిషాలపాటు భారీ వర్షం కురవడంతో పట్టణంలోని పలు వీధుల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడగా రైతులకు కాస్త ఊరట లభించినట్లు తెలుస్తోంది. గత మూడు నాలుగు రోజులుగా ఎండ తీవ్రత పెరిగి భరించలేని ఉక్కపోతతో ప్రజలు సతమతవుతున్న తరుణంగా భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడినట్లైంది. ఇటీవల అప్పుడప్పుడు చిరుజల్లులు మినహా వర్షాల జాడే లేకపోవడంతో ఖరీఫ్ పంట కాలం ప్రారంభంలో అక్కడక్కడ పంట పెట్టిన రైతులు ఆకాశం వైపు ఆశకు ఎదురుచూడాల్సి పరిస్థితి కొనసాగుతూ వచ్చింది. ఈక్రమంలో భారీ వర్షం కురవడంతో సాగులోవున్న వేరుశెనగ, కంది తదితర పంటలకు ప్రయోజనం చేకూరిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందిస్తే సాగు చేసుకుంటామని రైతులు కోరుతున్నారు.



భారీ వర్షం రాకతో వివిధ కాలనీల్లో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు

## ఎస్సీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలి

**- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి కుష్బూ కొఠారికు వినతి**

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

జిల్లాలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలని జిల్లా కేంద్రం అనంతపురంలో శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి కుష్బూ కొఠారికు వినతిపత్రం అందించినట్లు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు జెన్నే చిరంజీవి తెలిపారు. అనంతపురం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్నారన్నారు. బీసీలకు తరహాలోనే ఎస్సీలకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలన్నారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో కోచింగ్‌కు 20 నుంచి 30వేల రూపాయల వరకు ఫీజులు ఉన్నాయని అంత ఫీజు కట్టి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులు కోచింగ్ తీసుకోలేరన్నారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లి కోచింగ్ తీసుకోవడం అటుంచితే కనీసం మెటీరియల్ కొనగోలుకు కూడా డబ్బులులేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని వెంటనే స్పందించి ఉచిత కోచింగ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్ర జిల్లా అధ్యక్షులు మద్దలచెరువు వెంకీ, వీకేసీ పార్టీ మండల నాయకులు రమేష్, బీఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ్ ఉన్నారు.



జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారికు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## వర మహాలక్ష్మి పర్వదినాన శ్రీ యల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న పరిటాల సునీత

**రామగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త**



అమ్మవారి ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న పరిటాలసునీత

స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సరం శుక్రవారం, శ్రావణ మాసం, వరలక్ష్మి వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని, రామగిరి మండలం, వెంకటాపురంలోని శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు.

## ఆమిద్యాల ఆశ కార్యకర్త తులసమ్మకు సన్మానం

**- మనవరాలు పుట్టిందని గర్భిణీలకు భోజనం పెట్టించినందుకు అభినందనలు**

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త తులసమ్మను ఏపీ హంస ఘనంగా సన్మానించింది. రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏపీ హంస జిల్లా కన్వీనర్ ఎస్.ఎండీ.షఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆశ కార్యకర్త తులసమ్మను పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్‌నాయక్ చేతుల మీదుగా షాలువుకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గర్భంలో ఉన్నది ఆడపిల్లని తెలిస్తే చాలు బ్రూణ హత్యలకు పాల్పడుతున్న నేటి పరిస్థితుల్లో తులసమ్మ తనకు మనవరాలు పుట్టిందన్న సంతోషంతో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంకు వచ్చిన గర్భిణీలకు తన సొంత ఖర్చుతో భోజనం పెట్టించడం అభినందనీయమన్నారు. బేటీ బచావో-బేటీ పడావో అన్న నినాదాన్ని తులసమ్మ ఆచరణలో అమలు చేసి చూపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస ఉరవకొండ తాలుకా అసోసియేట్ ప్రసిడెంట్ నాగరంగయ్య, ప్రధాన కార్యదర్శి నిమ్మల వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత సిబ్బంది పాల్గొన్నారు.



ఆశ కార్యకర్త తులసమ్మను సన్మానించిన దృశ్యం

## మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన గాంధీ హరిజన హాస్టల్ కమిటీ

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**



రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు

ఉరవకొండ పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి షాలువాకప్పి పుష్పగుచ్చాన్ని అందించిన కమిటీ సభ్యులు దీర్ఘకాలికంగా కొనసాగుతూవస్తున్న గాంధీ హరిజన హాస్టల్‌కు సంబంధించిన భూమి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి అధికారుల నివేదిక తెప్పించుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు పాల్తూరు ఆనంద్‌రాజ్, కోనాపురం ఎర్రిస్వామి, మోపిడి వన్నూరుస్వామి, మీనుగ గోపాల్, ఆమిద్యాల నారాయణస్వామి, చిన్న ఆంజేయులు, బి.సాకే రమేష్, హెగ్గడ్డి సోమశేఖర్, రాజేష్, వ్యాసాపురం మహేష్, ముండ్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి వ్రతం

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ రెండో శుక్రవారం మండల వ్యాప్తంగా వరమహాలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో అమ్మవారి చిత్రపటాలు, ప్రతిమలను కొలువుదీర్చి విశేషంగా అలంకరించి వివిధ రకాల పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక వ్రత పూజలు జరుపుకున్నారు. వరాలిచ్చే దేవతగా కొలుస్తూ శ్రావణమాస శుక్లపక్షంలో పౌర్ణమికు ముందు వచ్చే శుక్రవారం రోజు వర మహాలక్ష్మి వ్రతం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వరమహాలక్ష్మి అమ్మవారిని పూజించడంవల్ల అష్టైశ్వర్యాలు సిద్ధించడమే కాకుండా కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని మహిళలు నమ్ముతారు.



వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబుచేసిన దృశ్యం

## మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన దుర్గా భవాని అమ్మవారు

**-శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్బంగా ప్రత్యేక పూజలు**



**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

పట్టణంలో వెలసిన దుర్గాభవాని అమ్మవారు స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ రెండవ శుక్రవారం మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. వరలక్ష్మి వ్రతం కావడంతో తెల్లవారుజాము నుండి అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు, అలంకరణ మహా మంగళహారతి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ వారికి తీర్థప్రసాదాలు అందించింది.

## గుత్తిలో ఘనంగా వరలక్ష్మివ్రతం



మహిళలు వ్రతం చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త**

శ్రావణమాసం రెండవశుక్రవారం పురస్కరించుకుని శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రధాన అర్చకులు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మివ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్బంగా అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి వరమహాలక్ష్మిదేవి వ్రతాన్ని రెండు గంటల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, యమున పూజ, వాయనపూజ నిర్వహించారు. ఈ వ్రతంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. పూజ అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవిమహిళామండలి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి**



ఆర్డీఓ మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఓబులేసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో గ్రామ రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దార్లు లలిత, లత, ఆర్ఐ సందీప్, మండల సర్వేయర్ సాయి, ఎఎస్ఒ, విఆర్ఒలు, గ్రామ సచివాలయం సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకై ర్యాలీ




గుత్తిలో హిందువులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త**

దేశ సరిహద్దులో వున్న బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల కారణంగా రాజకీయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆ దేశంలో హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం గౌతమపురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ సర్కిల్ నుండి గాంధీచౌక్ మీదుగా ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా, టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిమ్మారెడ్డి తదితరులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మతోన్మాదశక్తుల కారణంగా హిందువులకు రక్షణ కరువైందన్నారు. హిందువుల దేవాలయాలను ధ్వంసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని హిందువులను, దేవాలయాలను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ ర్యాలీలో బిజెపి మండల, పట్టణ అధ్యక్షులు నారాయణరెడ్డి, మూలింటి బాలకృష్ణ, టిడిపి నాయకులు ఎన్‌కె చౌదరి, కోనంకి కృష్ణ, రామకృష్ణ, పులికొండ రాయల్, ఎన్‌డిఏ కూటమినేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్బంగా ఎస్ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

## వైభవంగా వరమహాలక్ష్మి పూజవేడుకలు

**అమరాపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త**



మండల వ్యాప్తంగా వరమహాలక్ష్మిపూజ వేడుకలను ప్రతి దేవాలయాల్లో, ప్రతి ఇంటిలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా అమరాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయం, వాసవిమాత దేవాలయం, శ్రీషిరిడిసాయిబాబా దేవాలయం, హేమావతి సిద్దేశ్వరస్వామి దేవాలయంలో వరమహాలక్ష్మి వేడుకలను శ్రావణ శుక్రవారం సందర్బంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు ప్రసాదాన్ని అందచేశారు.

## ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోండి

**-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ**

**ఉరవకొండ, ఆగస్టు 16 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోజరిగే ఉచితశిక్షణ, ఉపాధికార్యక్రమానికి ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్య అధికారి ఎల్.ఆనంద్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 4 నెలలపాటు శిక్షణ ఉంటుందని, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు 3 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. 10వ తరగతి ఆపైన అర్హత కల్గిన వారు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నేరుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మొబైల్ నంబర్లు 70138 00115, 89192 39378కు సంప్రదించాలని సూచించారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



**అనంతపురం కల్చరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవ వేడుకల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రావణం స్వామినాయుడు పిలుపు మేరకు రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షులు భవాని రవికుమార్ సూచనల మేరకు అనంతపురం నగరంలోని స్థానిక కమలానగర్‌లో మహిళా నిరాశ్రముల ఆశ్రమంలో మెరుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ మెగా అభిమానులు న్.చంద్రమౌళి, రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు అంగడి వెంకటచలపతి, రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు ఇమామ్ హుస్సేన్ చిరంజీవి సేన జిల్లా అధ్యక్షులు కాయగూరల లక్ష్మిప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షుడు షామీర్, శివారెడ్డి, తిమ్మప్ప, అకిరాసాగర్, శేషాద్రి, భార్గవ్, ఆదినారాయణ, ఖాదర్‌వలి, బాబా, తదితరులు పాల్గొన్నారు. త్రివేణి థియేటర్ గోపాల్ సతీమణి మృతిపట్ల వారి కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

## పక్కా ఇళ్ళకు చట్టబద్ధత కల్పించాలి



విచారణకు హాజరైన లబ్దిదారులు

**గోరంట్ల ఆగస్టు 16 ప్రభాత వార్త,**

ఇల్లు లేని నిరుపేదలు మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో పక్కా గృహాలకు చట్టబదద్ధ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిలలకార్యదర్శి పెద్దన్న పేర్కొన్నారు. శుక్రవారం గోరంట్ల తాసీల్దార్ కార్యాలయంలో జరిగిన విచారణలో గృహాలు లబ్దిదారులు హాజరై నిబంధనలు ప్రకారం హక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాటాల్లడుతూ గత సంవత్సరం ఇళ్ల స్థలాలు కోసం పేదల దరకాస్తులు చేసుకున్నారని సకాలంలో సిబంధిత అధిఆరులు చర్యలు తీసుకోకపోవడంతో పేదల స్వచ్ఛందంగావ్యవసాయ కార్మిక సంఘం జెండాలు చేతపట్టి గుడిసెలు వేసుకొని సుదీర్ఘ పోరాటం అనంతరం పక్క గృహాలు నిర్మింకొని నివాసం ఉన్నవారికి నిబంధలు ప్రకారం హక్కుల్పి కల్పించి చట్ట ప్రకారం పట్టాలు మంజూరుకు సబంధిత అధికారులను ఆదేశించాలని అర్జీదారులు హై కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. రెండు నెలలలోపల అర్జీదారులకు పట్టాలు ఇవ్వడానికి అన్ని చర్యలు చేపట్టి పూర్తి చేయానలి ఆదేశించింది. విచారణకు హాజరుకావాలని పిటీషన్ దారులు అందరికి నోటీసులు ఇవ్వడం జరిగింది. తాసీల్దార్ వారి ఆదేశాల మేరకు నోటీసులు తీసుకున్న పిటీషన్ దారులందరూ రాతపూర్వక వివరణతోహాజరు కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ లబ్ధిఆరులు పోరాట కమిటీ నాయకులు అంజినాదేవి, స్వర్ణలత, నంజుండప్ప, ఆంజినేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిఐటిలియు మండల నాయకులు కొండా వెంకటేశులు, ఇళ్ల స్థలాల లబ్దిదారులు ముత్యాలప్ప, భాస్కర్, వెంకట లక్ష్మమ్మ, అస్వర్థమ్మ, ఆచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా,కళారంగాల్లో ప్రతిభను గర్తించి విద్యార్థులకు బహుమతులు

**గోరంట్ల ఆగస్టు 16 ప్రభాత వార్త,**

మండల కేంద్రంలోని గుమ్మయ గ్యారిపల్లి వద్ద గల ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యా, కళారంగాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రతి సంవత్సరం పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తూ వారికి ఆ రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూధన్ పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనపరచిన పలువురు విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పెదపల్లి, గుమ్మయ్యగారిపల్లి పాఠశాలలోని విద్యార్థులకు ఆటలు, పాటలు ఎస్సె రైటింగ్ పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనపరచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రిటైర్డ్ ఎంఈఓ సుబ్రమణ్యం, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## శివబాలయోగి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**గోరంట్ల ఆగస్టు 16 ప్రభాత వార్త,**

మహాయోగి శ్రీశ్రీ శివబాలోగి మహారాజ్ దేవాయలం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గోరంట్ల పంచాయతీ పరిధిలోని గుమ్మయ్య గారిపల్లి శివవబాలయోగి దేవాలయలో శుక్రవారం నాడు పత్ర్యేక పూజలు హోమాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శివబాలయోగి దేవాలయానికి భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎదత్తున తరలిరావడంతో శివబాలయోగి దేవాలయ ప్రాంగణంలో పండుగ వావతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భజనలు భక్తి పాటలతో భక్తులు శివబాలయోగి నామస్మరణతో తరలించారు. అనంతరం సాయంత్రం శివబాలోగి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వాహనం పై ఊరేగింపు నిర్వహించారు. శిబబాలయోగి మహారాజ్‌కు జై అంటూ భక్తులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శివబాలయోగి దేవాలయం ధర్మకర్త లక్ష్మీదేవమ్మ భక్తులు అదిలక్షమ్మ దేవీరమ్మ, సుశీలమ్మ, జయమ్మ పుటక ఈశ్వరప్ప, డ్రైవర్ శంకర్ లక్ష్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా జూటూరు రమణయ్య

**ధర్మవరం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త**



జూటూరు రమణయ్య

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం జూటూరు రమణయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవల పాత సత్రంలో ఆర్యవైశ్యులు సమావేశమై వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెల్లంపల్లి సుదర్శన్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా జూటూరు రమణయ్యను ఎంపిక చశారు. అధ్యక్ష పదవికి జూటూరు రమణయ్య ఎల్లంపల్లి సుదర్శన్ గుప్తా జయంతి వినోద్‌కుమార్ కర్ణాటక ముకుంద గోపా చంద్ర నామినేషన్లు వేయగా, వారిలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు తీవ్రమైన చర్చలు జరిపారు. అనంతరం పెద్దలు సూచనల మేరకు మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. తదుపరి ఎన్నికైన జూటూరు రమణయ్యను ఎల్లంపల్లి సుదర్శన్ గుప్తాలను సభ్యులు సన్మానించారు. ఈ నెల 18న ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు కలవల రాంకుమార్, కలవల మురళీధర్, ఓ.వి.ప్రసాద్, కాకమాని శ్రీహరి, కోటి లక్ష్మి వెంకటేశ్వర్లు, శ్రీహరి, రేపాకులసురేష్‌బాబు,రామకృష్ణ, పెనుజూరు నాగరాజు, బండ్లపల్లి రంగనాథ్, మైలవరం సాయినాథ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవా ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్ బాలికలకు విద్యా సామాగ్రి అందజేత

**ధర్మవరం రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త**

స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు తెల్లం నారాయణమూర్తి కార్యదర్శి చెన్నప్పల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లోని బాలికలకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం బిస్కెట్లు కూడా పంపిణీ చేశారు. తదుపరి నారాయణమూర్తి, చెన్నప్ప మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే దేశ భక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. అదే విధంగా చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధనుకనపర్చాలని తెలిపారు. క్రమశిక్షణతో అకుంఠిత దీక్షతో శ్రద్ధతో చదువు పట్ల ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మంజునాథ్, సభ్యులు వేణుగోపాల్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామాగ్రిని చూపుతున్న విద్యార్థులు

# ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 16 ప్రభాతవార్త

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం మండలం రాచానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియను గడువులోగా వేగంగా చేపట్టాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రికార్డులు మాన్యువల్‌గా వుండగా, సంఘాల్లో మెంబర్‌షిప్, లోన్, తదితర అన్ని రికార్డులను కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 57 సంఘాలకు సెంట్రల్ బ్యాంకు, మరో సంఘానికి యూనియన్ బ్యాంకు ఫైనాన్స్ చేయడం జరుగుతోంది. నాలుగు స్థాయిల్లో కంప్యూటరైజేషన్ చేపట్టాల్సి వుండగా సంఘాల్లో ప్రస్తుతం డేటా క్యాప్చర్ టూల్‌స్థాయిలో కంప్యూటరైజేషన్ జరుగుతోందని కేటాయించిన గడువులోగా వేగంగా ప్రక్రియను పూర్తి చేసి పంపించాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణాలు మంజూరు, డిపాజిట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, తదితర వాటికి సంబంధించి కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఇందుకోసం అధికారులంతా అప్రమత్తంగా పనిచేయాలన్నారు. సంఘాల ఉత్తమ పనితీరు కనబరిచేలా వేగంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఒ అరుణకుమారి, డిఎస్‌సిఒ ప్రభాకర్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సిఇఒ శ్రీనివాసులు, డిసిసిబి సిఇఒ స్వరూపారాణి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పెరటితోటల్లోని కూరగాయలతో ఆరోగ్యం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 16, ప్రభాతవార్త : ఇంటి పరిసరాల్లో పండిన కూరగాయలు, ఆకుకూరలతో చేసిన వంటలు తింటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా పదికాలాల పాటు క్షేమంగా ఉంటారని ఐవిడీ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ట్స్ శేషాద్రి, మండల ఇన్‌చార్జ్ పిట్టా ప్రభాకర్‌రెడ్డిలు ప్రజలకు సూచించారు. ఐవిడి జిల్లా ఇన్‌చార్జ్, మండల ఇన్‌చార్జ్, కోఆర్డినేటర్ శ్రీరాములు, ఏక్తల్ ఇన్‌చార్జ్ రాధాకృష్ణలు శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద పెరటి మొక్కలతో పాటు మామిడి, సపోటా, జామ, నిమ్మ, ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఇంటి పెరటిలో తోటల్లో పండిన కూరగాయలు వండి తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పెరట్లో చీడపీడల సమస్యలు ఉండవన్నారు. ఎటువంటి క్రిమి సంహారక మందులు పిచికారి చేయకుండా ఆకుకూరలు తినడం వల్ల మానవుని జీవిత కాలం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పెరటల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంపకం చేపట్టాలన్నారు. పండ్లను తినండి వ్యాధులను తరిమి కొట్టండి అనే నినాదంతో సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రైతులకు ఉచితంగా 1200 పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఎక్తల్ సంస్థ మండల కేంద్రంలో యువతకు ఉచితంగా టైలరింగ్; కంప్యూటర్ శిక్షణతో పలు సామాజిక సేవ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తోందన్నారు. కావున ప్రతి



పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న ఐవిడీ ఇన్‌చార్జ్

ఒక్కరూ పైసేవలను పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెవైయం యువమోర్చా కార్యదర్శి నరేష్ బాబు, ఇన్‌స్ట్యూట్ ట్రైనర్ శ్రీనాథ్; ఇన్‌చార్జ్ గంగిశెట్టి, అభియాన్ ప్రముఖ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా రాతిదూలం పోటీలు

## - మా నాన్న ఆత్మకు శాంతి కలగాలనే ఈ కార్యక్రమం - కోట్ల బాబి

ముదిగుబ్బ, ఆగస్టు 16 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోట్ల రమణ ప్రథమ వర్ధంతిని కుటుంబసభ్యులు ఘనంగా జరుపుకున్నారు. అతని జ్ఞాపకార్థం ఆయన తనయుడు కోట్ల బాబి రాతిదూలం పోటీలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాతిదూలం పోటీలను తిలకించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా పాతూరులో ఏర్పాటు చేసిన రాతి దూలం పోటీల్లో దాదాపు 15 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎద్దుల యజమానులకు మొదట బాబి శాలువాలు కప్పి వారిని సన్మానించారు. అనంతరం రాతిదూలం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మవరం తేదేపా ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కోట్ల రమణ టిడిపిలో వుంటూ సీనియర్ నాయకునిగా పార్టీకి సేవలందించారని అలాంటి వ్యక్తి ఈ రోజు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. రమణకు ఎద్దులు అంటే ఎంతో ప్రేమని ఇలాంటి పోటీలు గతంలో ఎన్నో నిర్వహించాడన్నారు. ఆయన జ్ఞాపకార్థం తనయుడు బాబి తన తండ్రి


రాతిదూలం పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం


ముఖ్యఅతిథిగా హాజరైన పరిటాల శ్రీరామ్

ఆత్మకు శాంతి కలిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన వేలాది మందికి భోజన వసతి కల్పించడం ప్రశంసనీయమన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు పారితోషికం ఇవ్వడమే కాకుండా పాల్గొన్న అన్ని జతల ఎద్దుల యజమానులకు తగిన రీతిలో పారితోషికం అందచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ హరీష్, టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్, పట్టణ కన్వీనర్ మనోహర్, బిజెపి మండల కన్వీన్ సోముల ప్రకాష్, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి వేడుకలు


మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కదిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి వేడుకలు శుక్రవారం స్థానిక మాధవ గురుకులంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి కిసాన్‌మోర్చ ఆర్గానిక్ స్టేట్ కన్వీనర్ చింత శరత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి యువ రాజకీయ నాయకులకు ఆయన జీవితం ఎంతో ఆదర్శ ప్రాయమని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన అసాధారణమైన ప్రతిభ కనబర్చి భారత ప్రదాని స్థాయికి ఎదిగిన ఆయన జీవితం విద్యార్థులందరికీ ఆదర్శమన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా గురుకులం పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానంచేశారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి అధ్యక్షులు మట్టా చెన్నరాయి శెట్టి, హరినాయక్, రిటైర్డ్ ఉద్యోగి గోపాల కృష్ణ,రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

# దళిత మిత్ర సంఘం ఆవిర్భావ సభకు బీజేపి నాయకులు షేక్‌బాబ్‌జాన్‌కు ఆహ్వానం

నంబులపూలకుంట, ఆగష్టు 16, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వారు అన్నమయ్య జిల్లా సంఘం సభ్యులు శుక్ర వారం బీజేపి మైనార్టీ మోర్చా స్టేట్ ఎక్స్‌క్యూటీవ్ మెంబర్ షేక్ బాబ్‌జాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. 7వ దళిత మిత్ర సంఘం ఆవిర్భావ సభకు హాజరు కావాలని షేక్‌బాబ్ జాన్‌ను ఆహ్వానించారు. దళిత మిత్ర సంఘం ఆవిర్భావ సభకు రాయచోటీ నుండి కడపకు వెళ్ళడానికి ఖర్చులకు గాను తనవంతు సహాయంగా బీజేపి నాయకులు షేక్ బాబ్‌జాన్ రూ. 10వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు కెవి రమణ, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షులు షేక్ చాంద్‌బాషా పాల్గొన్నారు.


బీజేపి నాయకులు షేక్‌బాబ్‌జాన్‌ను ఆహ్వానిస్తున్న దళిత మిత్రం సంఘం సభ్యులు

# నేడు కదిరిలో వైద్యసేవలు బంద్

కదిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త

పశ్చిమ బెంగాల్‌లోని అర్జికర్ మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఒక్కరోజు వైద్యసేవలు నిలిపివేయాలని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ పిలుపు మేరకు నేడు శనివారం ఉదయం 6 నుంచి 18వతేది ఉదయం 6 గంటల వరకు కదిరి ప్రాంతంలోని అన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు కదిరి ఐఎంఏ అధ్యక్షులు డా.మధన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోషియేషన్ బ్రాంచ్ నిర్ణయంమేరకు అత్యవసర సేవలను మినహాయింపు ఇవ్వడం జరిగిందని, కావున తమ నిరసనకు ప్రజలందరూ సహకరించవలసిందిగా కార్యదర్శి డాక్టర్ హుస్సేన్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్ కోరారు.

# పల్లె ఉమా జయంతి వేడుకలను జయప్రదం చేయండి

అమడగూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

అమడగూరు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగే పుట్టపర్తి నియోజకవర్గం అధ్యక్షులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా జయంతి వేడుకలను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మాజీ జెడ్‌పి టిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ వార్డు మెంబర్లు, బూత్ కన్వీనర్లు, జన్మభూమి కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.


గోపాల్‌రెడ్డి

# బళ్లారిలో 18న ఉచిత ఆరోగ్య శిబిరం

బళ్లారి, ఆగస్టు18, ప్రభాతవార్త; నగరంలోని ఆర్యవైశ్య అసోసియేషన్ బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి సంయుక్తంగా బళ్లారిలో ఈనెల 18న ఉదయం 10 గంట నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక వాసవీ కళ్యాణ మండపం, శ్రీ కన్యకా పరమేశ్వరి టెంపుల్ రోడ్డు బళ్లారిలో ఉచిత ఆరోగ్య శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ మల్లికార్జున, ప్రముఖ క్యాన్సర్‌వైద్యుడు డాక్టర్ శరన్నవరెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు డాక్టర్ ఫయాజ్, జనరల్ సర్జన్ డాక్టర్ హరిచరణ్‌లు ఈ ఆరోగ్య శిబిరంలో పాల్గొంటారని నిర్వాహకులు గిరిధర్‌లు తెలిపారు. సార్వజనికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరిఈక ఉచిత ప్రవేశం ఉంటుందని వైద్య చికిత్స అవసరమైతే బీపీఎల్ కార్డుదారులకు బెంగళూరులోని సప్తగిరి ఆస్పత్రిలో ఉచిత చికిత్స కల్పించడం జరుగుతుందని గిరిధర్ పేర్కొన్నారు.

# మహిళలకు వరలక్ష్మీవ్రతం శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 16 ప్రభాతవార్త

తాడిపత్రి నియోజకవర్గంలోని మహిళలకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి వరలక్ష్మీవ్రతం శుభాకాంక్షలు తెలియచేశారు. అమ్మవారి అనుగ్రహంతో నిండు నూరేళ్ల సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యంతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం ముత్తైదువులు వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పలువురు మహిళలు తమ స్వగృహాల్లో, మరికొందరు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం తోటి మహిళలకు వాయనం ఇచ్చారు. వ్రతం ముగిసిన అనంతరం హాజరైన వారికి తీర్థప్రసాదాలు అందచేశారు.


ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

# బ్యాంకు సిబ్బందిచే విద్యార్థులకు బహుమతుల ప్రదానం

యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి రాయలచెరువు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది బహుమతులను అందచేశారు. ఉదయ్, రాకేష్, రాంప్రసాద్‌లు మేనేజర్ జయశంకర్ తమకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించినందుకు ఉన్నతాధికారులు నగదు, బహుమతులతో ప్రోత్సహించారు. ఉన్నతాధికారులు తమకు అందచేసిన నగదుతో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో తాము వారికి ఈ బహుమతులు అందచేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు.


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న బ్యాంకు సిబ్బంది

# విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన తోరెడ్డి చిన్న రామిరెడ్డి జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన మనవడు రాజారెడ్డి ఆశ్రమ విద్యార్థులకు 620 నోటుపుస్తకాలను తన తోటి మిత్రుల ద్వారా పంపిణీ చేశారు. యాడికి పట్టణానికి చెందిన మక్కల చిన్న ఆంజనేయులు విద్యార్థులకు మిఠాయిలు, బ్రెడ్లు, పుస్తక సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 2001-02 సంవత్సరం 10వ తరగతి మిత్రబృందం గుండా నారాయణస్వామి, విశ్వం, చిన్న ఆంజనేయులు, గంగిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లికార్జున, వెంకటరమణ, చాంద్‌బాష, లాయర్ మహేష్, జగదీష్, హేమంత్ పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందచేస్తున్న దృశ్యం

# వరుణుడి కరుణకోసం ముస్లింలు ప్రత్యేకప్రార్థనలు

యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త

వరుణుడి కరుణకోసం మండలంలోని వేములపాడు గ్రామంలో పవిత్ర శుక్రవారం పురస్కరించుకుని గురువు సర్దార్‌వలి హాఫిజ్ ఆధ్వర్యంలో ముస్లింసోదరులు గ్రామ సమీపంలోని నది వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంటలు వర్షం లేక ఎండిపోతున్నాయని కరుణించి వర్షం కురిపించి ప్రజలకు ఆదుకోవాలని వారు అల్లాహ్‌ను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వేములపాడు గ్రామ ముస్లింసోదరులు పాల్గొన్నారు.


ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

# బళ్లారి వీఎస్‌కే యూనివర్సిటీ చాన్సలర్ డా.ఎం.మునిరాజు నియామకం


నూతన ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ మునిరాజ్

బళ్లారి, ఆగస్టు16, ప్రభాత వార్త; బళ్లారిలోని విజయ నగర శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం నూతన ఛాన్సలర్‌గా డా.ఎం. మునిరాజును నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఛాన్సలర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ తిప్పేరుద్రప్ప నూతన ఛాన్సలర్ మునిరాజుకు శుక్రవారం రంనాడు అధికార బాధ్యతలు అప్పగించారు. యూనివర్సిటీ సమగ్రాభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా శ్రమిస్తానని, యూనివర్సిటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వీలువెంబడి పరిష్కరిస్తానని తనను కలిసిన మీడియా ప్రతినిధులకు తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు, సిబ్బంది నూతన ఛాన్సలర్‌కు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.

### ఆలమూరు,ఇటుకలపల్లి,కాటీగానికాల్వ,కట్టకిందపల్లిలో

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## సర్పంచులు ,పంచాయితీ కార్యదర్శి సర్దార్‌వలి

అనంతపురం రూరల్, ఆగసు 15 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం ఆలమూరు, ఇటుకలపల్లి, కాటీగానికాల్వ,కట్టకిందపల్లి పంచాయితీలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని, భాతరదేశానికి స్వతంత్రం తీసుకవచ్చిన మహనీయుల ఆశయాలను కొనసాగిస్తామని సర్పంచులు బోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి,శీలక శారద ఆదినారాయణ రెడ్డి,గోనుగుంట్ల సౌమ్య, భాస్కర్‌రెడ్డి, ఆల


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం.

మూరు,కట్టకిందపల్లి, కాటీగానికాల్వ,ఇటుకలపల్లి పంచాయితీ కార్యదర్శి సర్దార్‌వలి పేర్కొన్నారు. గురువారం అనంత రూరల్ మండల నాలుగు గ్రామాలలో సర్పంచులు బోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి,శీలక శారద ఆదినారాయణరెడ్డి,గోనుగుంట్ల సౌమ్య,భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది మహనీయులు బ్రిటీష్ వారితో పోరాటాలు చేయడం వలనే మనం ఇవ్వాల గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, వైకాపా నాయకులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు సచివాలయ ఉద్యోగులు, పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని చింతలాయపల్లి గ్రామానికి చెందిన గంగన్న (75) అనే వృద్ధుడు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తండ్రి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుమార్తె మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సేవలను కోరింది. దీంతో ఫౌండేషన్ సభ్యులు యాడికి నుండి చింతలాయపల్లి గ్రామానికి చేరుకుని సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, దృవనారాయణ, వేణు, నాగరాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

# అగాపే ఆశ్రమంలో అన్నదానం

యాడికి, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండల కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్రకాలనీలో వున్న అగాపే ఆశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతురాయి స్వామిదాసు (ఆర్టీసి డ్రైవర్) 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన భార్య మేరీ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు ఆనంద్, అనిల్, అభిషేక్, రాణి, రంగమ్మ, వసంత (టీచర్), తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

# 19వ క్రస్ట్ గేట్ నిర్మాణ పనులు

## - రెండో రోజు కొనసాగిన ఎలిమెంట్ కార్యాచరణ

ఫోటో నం. 16 బళ్లారి 02. బళ్లారి, ఆగస్టు16, ప్రభాతవార్త; తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేట్ స్థానంలో స్టాప్ లాగ్ గేట్ నిర్మించే పనులు రెండో రోజు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంజనీరింగ్ నిపుణుడు క్నన్యనాయుడు పర్యవేక్షణలో సుమారు వంద మంది దాకా ఇంజినీర్లు, టెక్నీషియన్లు, సాంకేతిక సిబ్బంది పగలు, రాత్రి డ్యాం పైభాగంలోనే ఉండి 19వ క్రస్ట్ గేట్‌ను నిర్మించే కార్యంలో నిమగ్నమయ్యారు. జిందాల్ స్టీల్ ప్లాంట్ నుంచి కీలకమైన గేట్‌ను గురువారం రాత్రి 9 గంటలకు తుంగభద్ర డ్యాం ప్రాంతానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 19వ తూము వద్ద గేటు కూర్చోబెట్టేందుకు అవసరమైన ప్లాట్ ఫాంను సిద్ధం చేసి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోనే క్రెయిన్‌ల సాయంతో ఎలిమెంట్‌ను అడుగుభాగంలోకి దించారు. డ్యాంలో సగం వరకైనా నీరు కాపాడుకునేవిధంగా త్వరితగతిన క్రస్ట్ గేట్ నిర్మించేందుకు అహర్నిశలు శ్రమిస్తుండడం కనిపించింది. కాగా ఆరు రోజుల్లో 33 టీఎంసీల నీరు వృథా జరిగింది. డ్యాం ఔట్ ఫ్లో పరిమాణాన్ని 1.10 లక్షల క్యూసెక్కుల నుంచి 86,310 క్యూసెక్కులకు తగ్గించడం విశేషం. డ్యాం గరిష్ట నీటిమట్టం 1633 అడుగులు కాగా, ప్రస్తుతం 1623.79కు చేరింది. ప్రస్తుతం డ్యాంలో 72.60 టీఎంసీల మేరకు నీరు ఉంది. శనివారం సాయంత్రం నాటికి 19వ క్రస్ట్ గేట్ పూర్తిస్థాయిలో నిర్మించే అవకాశం ఉంది.


భారీ క్రేన్‌లతో టీబీ డ్యాం 19వ క్రస్ట్ గేట్ ఎలిమెంట్‌ను క్రస్ట్ గేట్ ప్రాంతంలో దించుతున్నప్పటి దృశ్యం

# రాష్ట్రంలో 91 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాగా గుర్తింపు

## - రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ

బళ్లారి, ఆగస్టు16, ప్రభాతవార్త; రాష్ట్రంలో మొత్తం మొత్తం 1.40 కోట్ల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ల్యాండ్ బీట్ మొబైల్ సాంకేతిక పరిజ్ఞానం ద్వాఅ మొత్తం 91 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ తెలిపారు. ప్రిన్స్ మైదానంలో 78 స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న అనంతరం మీడియా ప్రతినిధులతో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే 14.32 లక్షల ప్రభుత్వ భూముల స్థల పరిశీలనకు సూచించినట్లు ఇందులో లక్షల భూములకు విలేజీ అకౌంటెంట్లు భేటీ చేసి పరిశీలించారని చెప్పారు. ఇందులో రెవెన్యూశాఖ 1.93 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు వివిధ శాఖలకు సంబంధించి భూములను గుర్తించడం జరిగిందన్నారు. చెరువులు శ్మశాన వాటికల భూముల్ని మొదటిగా గుర్తించి సమీక్ష జరిపినట్లు ఇప్పటికే బళ్లారి జిల్లాలో 80.27 శాతం అనగా 56.638 ప్రభుత్వ భూముల్లో 48,786 ఆస్తుల్ని ల్యాండ్ బీట్ సాంకేతిక పరిజ్ఞానానికి చేర్చినట్లు చెప్పారు. ఆగస్టు నెల నుంచి సర్వేయర్ల లభ్యత మేరకు కబ్జాకు గురైన వాటిని స్వాధీన పరుచుకుంటామన్నారు. భూ సురక్ష యోజన కింద అన్ని దాఖలాలను స్కాన్ చేసి ఇండెక్స్ చేసి డిజిటల్ చేయడం జరిగింది. సంవత్సరంలోగా డిజిటలీకరణ ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపిన మంత్రి దీంతో సార్వజనికులకు తమ ఆస్తిపాస్తులు రికార్డులను మోసాలకు గురికాకుండా నియంత్రించడం జరుగుతుందన్నారు. భూముల క్రయవిక్రయాల్లో వంచన నియంత్రణకు పహణీ ఆధార్ లింక్ చేయడం జరుగుతుందన్నారు. బళ్లారి జిల్లాలో 80 శాతం 4,12,084 రైతుల భూయజమానుల భూముల్ని వారి ఆధార్ నంబర్లకు లింక్ చేయడం జరిగిందని వివరించారు. సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, లిడ్కర్ సంస్థ అధ్యక్షులు ముండ్రగి నాగరాజ్, మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాస్థాయి వివిద శాఖల అధికారులు, పాలికే సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడతున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ

# ఘనంగా శ్రీవరలక్ష్మీవత్రం వేడుకలు

అమడగూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం శ్రీవరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని నూతన పట్టువస్త్రాలతో పాటు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వివిధ రకాల పండివంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు వరలక్ష్మీవత్రం వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


వరలక్ష్మిదేవిని అలంకరించిన దృశ్యం

